క్లుప్తంగా

రేపు అన్ని పాఠశాలల్లో మెగా పీటీఎం

అమరావతి: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఈనెల 7వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్(పీటీఎం) నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి చాదరాజుపల్లి శివబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల బలోపేతం, విద్యా వికాసం, సమస్యలు పరిష్కారానికి విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ఈ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రమంతా జరిగే ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని పాఠశాలలో ఒకే సమయంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఈ సమావేశంలో విద్యార్థి తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు, పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9 గంటలకు మొదలై మధ్యాహ్నం ఒంటిగంటకు మధ్యాహ్న భోజనంతో ముగుస్తుందన్నారు. ప్రజా ప్రతినిధులను, అధికారులను, దాతలను, పూర్వ విద్యార్థులను ఆహ్వానించి రాజకీయాలకు అతీతంగా కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): సామాజిక సేవ విద్యలో భాగమేనని, విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయ్‌కుమార్ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎన్ఎస్ఎస్(జాతీయ సేవాపథకం) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక సేవ చేయడం ద్వారా విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పాటు సామాజిక అభివృద్ధిపై అవగాహన పెరుగుతుందన్నారు. గ్రామంలో వారం రోజులు పాటు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కళాశాల ఏఓ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఏఓ ఎం.అరుణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రవల్య, వీఏఏ శైలజ తదితరులు పాల్గొన్నారు.


సేంద్రియ ఎరువులతో భూమిని కాపాడుకోవచ్చు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): రైతులు నేలను కాపాడుకునేందుకు సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం రైతుభరోసా కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవం కార్యక్రమం గురువారం నిర్వహించారు. రసాయనిక ఎరువుల వాడకం వలన భూమి నిస్సారం అవుతుందని, నేలలోని సహజ సారం దెబ్బతింటుందన్నారు. దీని వలన పంటల దిగుబడి బాగా తగ్గుతుందన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులందరూ కూడా రసాయనిక ఎరువుల వాడకం తగ్గించేలా పంటలు పండించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఎంపీడీఓ పీజే విలియమ్స్, జడ్పీ స్కూల్ హెచ్ఎం కె.నాగేంద్రమ్మ, రైతులు పాల్గొన్నారు.

పందులను గ్రామాల్లోకి వదిలితే చర్యలు

క్రోసూరు: క్రోసూరులో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, అలా తిరిగితే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు పందుల పెంపకందారులకు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా వారి ఇళ్లకు వెళ్లి హెచ్చరించారు. పందులు వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురువుతారని, రోడ్లపై మలమూత్రాలు విసర్జిస్తున్నాయని, వీధుల్లో ఇళ్ల ముందు ఎక్కడబడితే అక్కడ తిరుగుతున్నాయని అన్నారు. పందులను గ్రామంలో తిప్పటానికి వీలు లేదని హెచ్చరించారు. పందులు గ్రామంలో తిరుతున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ పాల్గొన్నారు.

రూపెనగుంట్ల విద్యార్థికి గోల్డ్‌మెడల్



నకరికల్లు: మండలంలోని రూపెనగుంట్ల గ్రామానికి చెందిన గోగా అనీల్ తమిళనాడులోని తిరువారూర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మెస్సీలో గోల్డ్‌మెడల్ సాధించాడు. గోగా అనిల్ మహమ్మారి మరియు ప్రజారోగ్యశాస్త్రంలో ప్రతిభను కనబరచడంతో విశ్వవిద్యాలయం ఛాన్స్‌లర్ పద్మనాభన్ చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నాడు. తమ గ్రామానికి చెందిన యువకుడు గోల్డ్‌మెడల్ సాధించడంపై విద్యార్థి తండ్రి గోవిందరాజులు, కుటుంబసభ్యులను గ్రామస్తులు గురువారం అభినందించారు.

సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

సత్తెనపల్లి ఆర్డీఓ జీవీ రమణకాంత్‌రెడ్డి

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సులు ఉద్దేశమని సత్తెనపల్లి ఆర్డీఓ జీవీ రమణకాంత్‌రెడ్డి చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సులపై మండలస్థాయి అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. భూ సర్వే, పట్టాదారు పాసు పుస్తకాలతో పాటుగా అన్ని శాఖలకు సంబంధించి ఎటువంటి సమస్యనైనా సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. మండలస్థాయి అధికారులు హాజరై సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారన్నారు. ప్రారంభ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు హాజరవుతారని, ఆ మేర ఏర్పాట్లు చేయాలని సూచించారు. తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌ల క్ష్మీప్రసాదు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండలంలో నేటి నుంచి..

ఈ నెల 6 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ గురువారం తెలిపారు. 6న గోళ్లపాడు గ్రామంలోను, 10న ముప్పాళ్ళ, 12న చాగంటివారిపాలెం, 17న దమ్మాలపాడు, 19న తొండపి, 21న రుద్రవరం, 24 మాదల, 27న ఇరుకుపాలెం, 28న లంకెలకూరపాడు, 31న పలుదేవర్లపాడు గ్రామాల్లోని గ్రామసచివాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. 2025 జనవరి 2వ తేదీన బొల్లవరం గ్రామసచివాలయం వద్ద, 3వ తేదీన దేచవరప్పాడు గ్రామసభ తొండపి గ్రామసచివాలయం వద్ద, 4వ తేదీన నార్నెపాడు గ్రామసచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు జరుగుతాయన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ఆయా సదస్సులకు హాజరు కావాలన్నారు.

రెవెన్యూ సదస్సుపై అవగాహన

రాజుపాలెం: మండలకేంద్రంలోని రాజుపాలెం గ్రామ సచివాలయంలో ఈనెల 6వ తేదీ నుంచి జరిగే రెవెన్యూ సదస్సులపై రైతులకు అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో వీఆర్వో నాగలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన రెవెన్యూ సదస్సు జరుగనున్నందున ప్రతీ రైతు పాల్గొనాలని సూచించారు. అడంగులలో చేర్పులు, మార్పులు, పాస్ పుస్తకాల కోసం, భూమి సమస్యలు ఉంటే సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. భూ సమస్యలు ఏమి ఉన్నా పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



గోళ్ళపాడు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన ఆర్డీఓ జీవీ రమణకాంత్‌రెడ్డి

నేడు ఫణిదం గ్రామ సచివాలయం ప్రారంభం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో ఈ నెల 6న గ్రామ సచివాలయం-2 ప్రారంభోత్సవం జరుగుతుందని సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. కావున సత్తెనపల్లి మండలంలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి సత్తెనపల్లి మండలంలో..

సత్తెనపల్లి: భూములు, తదితర రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కెఎస్ చక్రవర్తి గురువారం తెలిపారు. ఈ నెల 6న పెదమక్కెన, 7న గుడిపూడి, 10న నందిగామ, 11న కంటెపూడి, 12న కొమెరపూడి, 13న లక్కరాజుగార్లపాడు, 17న భీమవరం, 18న కంకణాలపల్లి, 19న దూళిపాళ్ల, 20న బృగుబండ, 21న పాకాలపాడు, 26న రెంటపాళ్ళ, 27న అబ్బూరు, 28న ఫణిదం, 31న బట్లూరు, జనవరి 2న కట్టమూరు, గోరంట్ల, 3న సత్తెనపల్లి, వడ్డవల్లిలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

నకరికల్లు: ఈనెల 6వతేదీ నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని తహసీల్దార్ కె.పుల్లారావు గురువారం తెలిపారు. ఈనెల 6వతేదీన చాగల్లు, కండ్లకుంట, 10న చీమలమర్రి, 12న దేచవరం, 13న రూపెనగుంట్ల, 17న చల్లగుండ్ల, 18న కుంకలగుంట, 19న చేజర్ల, 21న నర్సింగపాడు, 24న త్రిపురాపురం, 27న గుండ్లపల్లి, 28వ తేదీన నకరికల్లు గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని రైతులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు..

అమరావతి: మండలంలో గ్రామాలలో నేటి నుంచి జనవరి 2వ తేదీవరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ వైకుంఠపురం, 7 పెదమద్దూరు, 10 ఎండ్రాయి, 11 నరుకుళ్ళపాడు, 12 కర్లపూడి, 13 ఉంగుటూరు, 17 నెమలికల్లు, 18 అత్తలూరు, 19 మునగోడు, 20 జూపూడి, 21 మల్లాది, పొందుగల, 24 దిడుగు, 26 ధరణికోట-1, 27 ధరణికోట-2, 28 అమరావతి-1, జనవరి 2 అమరావతి-2, 3వ తేదీ లింగాపురం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

బెల్లంకొండ మండలంలో...

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్న రెవెన్యూ గ్రామసభలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అష్రఫున్నీసా బేగం గురువారం తెలిపారు ఈనెల 6వ తేదీ నాగిరెడ్డిపాలెం, 10న నందిరాజుపాలెం, 11న గంగిరెడ్డిపాలెం, 12న బోధనం ,13న కందిపాడు, 17న చంద్రాజుపాలెం, 18న మన్నెసుల్తాన్‌పాలెం, 19న ఎమ్మాజీగూడెం, 20న వెంకటాయపాలెం, 26న పాపాయపాలెం, 27న వన్నాయపాలెం, 28న మాచాయపాలెం, 31న న్యూ చిట్యాల ఆర్‌ఆర్ సెంటర్, జనవరి 3వ తేదీన బెల్లంకొండ గ్రామాలలో గ్రామసభలు ఉంటాయని తెలిపారు.

నేడు 88త్యాళ్లూరు, ఉయ్యందనలో...

క్రోసూరు: మండలంలోని 88త్యాళ్లూరు, ఉయ్యందన గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ శ్రీనివాసయాదవ్ గురువారం తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు 88త్యాళ్లూరు సచివాలయంలో, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు ఉయ్యందన గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహిస్తారని తెలిపారు. సదస్సుల్లో రైతుల అర్జీలు తీసుకుని పరిష్కరిస్తారని తెలిపారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

ఆకర్షణీయం..అనారోగ్యం

- విచ్చలవిడిగా స్నాక్స్, చిరుతిళ్లు విక్రయాలు
- పిల్లలను ఆకట్టుకునేలా ప్యాకింగ్‌లు
- తయారీలో కానరాని నాణ్యతా ప్రమాణాలు
- నియోజకవర్గవ్యాప్తంగా నెలకు రూ.50 లక్షలకు పైగా విక్రయాలు



దుకాణాల్లో విక్రయిస్తున్న రంగురంగుల స్నాక్స్ ప్యాకెట్లు

బెల్లంకొండ: ఆకట్టుకునే రంగులు... విచిత్రమైన బొమ్మలు.. అందులో నోరూరించే చిరుతిళ్లు. వాటిని చూస్తే చాలు కొనేదాకా చిన్నపిల్లలు వదలరు. చిన్నారులలోని బలహీనతను గ్రహించిన తయారీదారులు నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలేసి, నాసిరకం తినుబండారాలను తయారు చేస్తున్నారు. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో స్నాక్స్ వంటి చిరు తిరుతిళ్లు నాసిరకంగా ఉంటున్నాయి. అధిక మోతాదులో ఉప్పు, కారంతో పాటు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హానికరమైన రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇలాంటివి తింటే రోగాలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా వీటిని నిరోధించేవారు కరువయ్యారు.

ఎక్కడ చూసినా...

నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో దుకాణాలలో నాణ్యతలేని ఆహార పదార్థాల ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాల్లో నాసిరకం ఆహార పదార్థాలు విక్రయాలు జరుగుతున్నాయి. ప్రతి నెల దాదాపుగా రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఇతర ప్రాంతాల నుంచి తిరుబండారాలు దిగుమతి అవుతున్నాయి. మండలాలలోని హోల్‌సేల్ వ్యాపారులు అన్ని గ్రామాలలోని కిరాణా షాపులకు వీటిని సరఫరా చేసి అమ్ముతున్నారు.

అధికారుల తనిఖీలు కరువు..

మార్కెట్లో లభించే తినుబండారాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఆహార తనిఖీ, రెవెన్యూ, తూనికలు, కొలతల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దుకాణాలలో ముడుపులు తీసుకుంటూ పర్యవేక్షణను గాలికి వదిలేసారని పలువురు విమర్శిస్తున్నారు. కనీసం నెలకు ఒకసారైనా దుకాణాలను తనిఖీ చేయాలని కోరుతున్నారు.

చిరుతిళ్లకు దూరంగా ఉండాలి

మార్కెట్లో దొరికే చిరు తినుబండారాలు, జంక్ ఫుడ్‌కు పిల్లలు, పెద్దలు దూరంగా ఉండాలి. రుచి, నిల్వ కోసం వాటిలో ఉపయోగించే రసాయనాలు, రంగులతో కడుపునొప్పి, అజీర్తి వంటి తక్షణం సంభవించే వ్యాధులతో పాటు భవిష్యత్తులో ఎసిడిటీ, జీర్ణకోశ, కిడ్నీ, పేగు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. చిరుతిళ్ల విషయంలో పిల్లలు, పెద్దలు అందరూ జాగ్రత్తగా ఉండాలి.

– డా. కె.వి.కోటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి, బెల్లంకొండ

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

ఫ్యాప్టో మండలశాఖ ప్రతినిధులు

అచ్చంపేట: రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్‌పై కొంత మంది విద్యార్థులు దాడిచేయడంపై ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఫ్యాప్టో)విచారం వ్యక్తంచేసింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎంఈఓ ఏకుల ప్రసాదరావుకు వినతిపత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా పాఠశాల ఆవాస ప్రాంతంలో గంజాయి సంస్కృతి ఉన్నట్లు తెలుస్తోందని, ఆ ప్రభావం పాఠశాల విద్యార్థులపై పడి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి చాపకింద నీరులా మరికొన్ని ప్రాంతాలను వ్యాపించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులలో అగ్రిసెవ్ నేచర్ పెరగడం, బాలికల పట్ల అనుచితంగా వ్యవహరించడం, ఉపాధ్యాయులను కించపరచడం లాంటి విపరీత ధోరణులు పెరుగుతున్నాయన్నారు. ఈ విష సంస్కృతిని ప్రభుత్వమే అరికట్టాలని, న్యాయవిచారణకు ఆదేశించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, ఉపాధ్యాయుని కుటుంబానికి న్యాయం చేయాలని ఫ్యాప్టో ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు జి.గంగయ్య, బత్తుల సాంబశివరావు, తుమ్మా శౌర్రెడ్డి, గనుపల్లి సునీల్, బి.రామారావు, యంవి రామానాయక్, యం.లక్ష్మి పాల్గొన్నారు.

సత్తెనపల్లి: అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి జడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్ మీద దాడికి పాల్పడిన వారిని న్యాయ విచారణ జరిపి తక్షణమే సంబంధం ఉన్నవారిని అరెస్టు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు పాఠశాల ఎదుట నల్లబ్యాడ్జి ధరించి నిరసన తెలిపారు.



అచ్చంపేటలో ఎంఈఓ ప్రసాదరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

సత్తెనపల్లి: అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్ మృతికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య బాధ్యులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపు మేరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఎంఈఓలు ఎ.శ్రీనివాసరావు, ఎ.రాఘవేంద్రరావులకు వినతి పత్రాలు అందించారు. ఎస్ఎం సుభాని, చిన్నం శ్రీనివాసరావు, బండి రమేష్ బాబు, బంకా వాసుబాబు, ఎస్ఎం రెహమాన్, ఎం.అప్పారావు, సయ్యద్ తాజుద్దీన్, నంబుల విష్ణుమూర్తి, శివారెడ్డి, సురేష్, రాజు, సుబ్బు, ఇబ్రహీం, ప్రేమ్ కుమార్, ఏడుకొండలు, ఉన్నారు.

క్రోసూరు: కడపజిల్లా రాయచోటి కొత్తపల్లి ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్‌పై మృతి ఘటనపై తీవ్రంగా కలిచివేసిందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఉపాధ్యాయసంఘాల సమాఖ్య(ఫ్యాప్టో)తెలిపింది. గురువారం ఈ మేరకు ఎంఈఓ-2 ఎం.గణేష్‌కు వినతిపత్రం అందచేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు తగిన రక్షణ కల్పించాలన్నారు. ఉపాధ్యాయుడు మృతి కారకులైన విద్యార్థులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. ఫ్యాప్టో ప్రతినిధులు సాతూలూరి రాఘవ, రవికాంత్ రెడ్డి, ఎస్.చంద్రం, గోవిందరెడ్డి, లక్ష్మీనారాయణ, ఎంకే బాబు, మోహన్‌బాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాలు (ఆయా) పోస్టులను భర్తీ చేయుటకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ టి.శ్రీలత గురువారం తెలిపారు. రాజుపాలెం మండలం మొక్కపాడు, నకరికల్లు మండలం చాగల్లు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ముప్పాళ్ల మండలం ఇరుకుపాలెం, మాదల, రుద్రవరం, మాదల, రాజుపాలెం మండలం రాజుపాలెం, మొక్కపాడు, పెదమెలిపురి, ఇనిమెట్ల, నకరికల్లు మండలం దేచవరం, చల్లగుండ్ల, కండ్లకుంట, గుండ్లపల్లి, కుంకలగుంట, సత్తెనపల్లి మండలం నందిగామ, గర్నెపూడి, గండ్లూరు, లక్కరాజు గార్లపాడు, వెన్నాదేవిలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు తో పాటు పుట్టిన తేదీ, వయసు, కుల, విద్యార్హత, నివాస స్థల ధ్రువీకరణ పత్రం, అదనపు అర్హతలు ఉంటే జత చేయాలన్నారు. పూర్వ అనుభవ ధ్రువీకరణ పత్రం , విడో అయితే భర్త మరణ ధ్రువీకరణ పత్రం, అనాథలైనచో అనాథ సర్టిఫికెట్, దివ్యాంగులు అయితే వికలాంగ శాత సర్టిఫికెట్, విడో అయితే 18 సంవత్సరాల లోపు పిల్లలు ఉన్న ఎడల పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం జత చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుకు అభ్యర్థిని తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణురాలై, 2024 జూలై 1 నాటికి 21 సంవత్సరాల వయసు నుంచి 35 సంవత్సరాల వయసు లోపు వారై ఉండాలన్నారు. అభ్యర్థిని తప్పనిసరిగా వివాహితురాలై ఉండాలని, స్థానిక నివాసితులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థినులు 21 సంవత్సరాలు నిండిన వారు లేనిచో దిగువ వయసు 18 సంవత్స రాలు నిండిన వారిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు లకు సంబంధిత ధ్రువపత్రాలతో సహా ఈనెల 6 నుంచి 18వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సత్తెనపల్లి సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. గడువు తేదీ తదుపరి వచ్చిన దరఖాస్తులను స్వీకరించబడవన్నారు. అర్హత లేని వారి దరఖాస్తులను తిరస్కరిస్తామన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

సెమీ క్రిస్మస్ వేడుకల్లో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ

సత్తెనపల్లి: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. పట్టణంలోని చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమం పాఠశాలలో ఐక్య మాల మహానాడు సత్తెనపల్లి నియోజకవర్గ ఆధ్వర్యంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కన్నా ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. గుంటూరు సినడ్ బిషప్ సెంట్రల్ రెవ డాక్టర్ ఎస్ జె.బాబురావు క్రిస్మస్ సందేశం అందించారు. సభా పరిచయం దారా మసలయ్య చేపట్టగా ఉపాధ్యాయుడు జెల్డి విజయ ప్రసాద్ అధ్యక్షత వహించారు. వేడుకల్లో టీడీపీ నాయకుడు దరువూరి నాగేశ్వరరావు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యరావు, ఐక్యమాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటూరు ఆశీర్వాదం, నియోజకవర్గ అధ్యక్షుడు కుంచకర్ల జోసెఫ్, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ పూరం సుందరరావు, యర్రజొన్నల మరియ దాసు, నేలటూరి బాలకృష్ణ, గుడిశె బుల్లి కోటయ్య, బిల్లా రవి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఆందోళన

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తెలి పారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాంబాబు మాట్లాడుతూ ఈనెల 9, 10 తేదీలలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలతో పాటు విద్యుత్ ఛార్జీల పెంపుపై ఆందోళనలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఎన్నికల హామీలో రాష్ట్రంలో విద్యుత్ చార్జీలపై పెంపుదల ఉండదని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే సామాన్యుడి నడ్డి విరిచేలా ఛార్జీలను పెంచుతున్నారని విమర్శించారు. కాగా, సిపిఐ పార్టీ శత వార్షిక ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈనెల 26వ తేదిన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, రొంపిచర్ల మండల కార్యదర్శి ఆర్.అంజిరెడ్డి, ఉప్పటపాటి రంగయ్య, షేక్.చినజాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

బొల్లాపల్లి: ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి లోని బొల్లాపల్లి, ఈపూరు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకులు (ఆయా) పోస్టులకు ఈ నెల 18వ తేదీ లోపు దరఖాస్తులు చేస్తు కోవాలని సీడీపీవో బి. అరుణ గురువారం తెలిపారు. బొల్లాపల్లి మండలంలో గుమ్మనంపాడు ఎస్సీ , కేసవానిపేట తండా ఎస్టీ, ఊడిజర్ల ఓసీ, ఈపూరు మండలంలో ఈపూరు మెయిన్ బీసీ-బీ, అంగలూరు ఎస్సీ, వనికుంట బీసీ-డి ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. స్థానిక వివాహిత మహిళ అయి ఉండి 21 నుంచి 35 సంవత్సరాల వయసు గలవారై 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. పాస్‌పోర్ట్ ఫోటో, విద్యార్హత పత్రాలు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు తదితర సంబంధిత పత్రాలను జత చేసి ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయంలో అందజేయాలని వివరించారు. మరిన్ని వివరాలకు 9491051603ను సంప్రదించాలన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని అచ్చంపేట వెళ్లే మార్గంలో గల నిర్మలా నగర్ రైల్వే గేట్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం వెలుగు చూసింది. మృతుడి జేబులో క్రోసూరు మండలం ఉయ్యందన నుంచి సత్తెనపల్లి వచ్చిన బస్ టికెట్ ఉంది. ఈ ఘటన పై అనుమానాస్పద మృతిగా రైల్వే పోలీసులు. కేసు నమోదు చేసి మృతదేహన్ని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినట్లయితే 77801 71069 నెంబరులో సంప్రదించగలరని రైల్వే ఏఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

అప్పులబాధతో కాంట్రాక్టర్ మృతి



సాంబశివరావు (ఫైల్)

సత్తెనపల్లి: అప్పుల బాధ తాళలేక కాంట్రాక్టర్ ఒత్తిడికి గురై అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడులో గురువారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఇరపని సాంబశివరావు (56) గ్రామంలో 2017-18లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాడు. మొత్తం రూ.80 లక్షలతో పనులు చేయగా రూ.30లక్షలు బిల్లులు వచ్చాయి. మిగిలిన రూ.50 లక్షల కోసం తిరుగుతున్నాడు. వడ్డీకి అప్పులు తెచ్చి పనులు చేశాడు. ఈ క్రమంలో ప్రభుత్వం మారటం, అప్పు ఇచ్చిన వాళ్లు తిరిగి డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో తనకు ఉన్న అరెకరం పొలం విక్రయించాడు. తన ఇంటిని కూడా తాకట్టు పెట్టి కొంత అప్పులు తీర్చాడు. మిగిలిన అప్పులు కూడా తీర్చాలని అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో భరించలేక అధిక రక్తపోటుతో పాటు షుగర్ లెవల్స్ కూడా ఒక్కసారిగా పెరగడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ ఖర్చులు భరించలేక గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకువచ్చారు. మెదడులో రక్తం గడ్డకట్టడం, పక్షవాతం రావడంతో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య పేరాదేవి, కుమార్తెలు నాగమల్లేశ్వరి, మహలక్ష్మీ, జయమ్మ ఉన్నారు. సాంబశివరావు మృతదేహన్ని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా సందర్శించి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన శావల్యాపురం విద్యార్థిని



శావల్యాపురం: జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు శావల్యాపురం హైస్కూల్ ఇంటరు ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆకుమళ్ళ సమీరా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 8వ ఫెడరేషన్ కప్ ఛాంపియన్‌షిప్ జాతీయ స్థాయి పోటీలు ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని కొడగు జిల్లా కుషాల్ నగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆకుమళ్ళ సమీరా పాల్గొంటుందన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో బాగా రాణించాలన్నారు. విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావన్‌కుమార్, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి అభినందించారు.

రేపు మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్

శావల్యాపురం: మండలంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7న జరగనున్న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఉన్న అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఛైర్మన్లు సారథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 01 వరకు సమావేశాలు ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనల మేరకు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశాల్లో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా అలాగే పూర్వపు విద్యార్థులను ఆహ్వానించి పాఠశాలలు బలోపేతానికి కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను అందజేసి చిన్నారుల శక్తిసామర్థ్యాలను వివరించాలన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డపాటి విజయలక్ష్మి ప్రత్యేకంగా ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావుకు పోలీసు స్టేషనులో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ పాటిబండ్ల శ్రావన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎస్ఐ లోకేశ్వరరావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉపాధ్యాయులు

రొంపిచర్లలో...

రొంపిచర్ల : మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 7న మెగా పేరెంట్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఓ డి.బ్రహ్మేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఎంఇఓ డి.బ్రహ్మేశ్వరరావు సందర్శించి మెగా పేరెంట్స్ సమావేశంపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించటమే మెగా పేరెంట్స్ సమావేశాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు.